

టెన్త్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

డిఇఒ సలీం భాష

ప్రజాశక్తి -డుంబ్రిగూడ:వచ్చేనెల 3 నుంచి జరుగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను అల్లూరి జిల్లా డీఈవో సలీం భాష సోమవారం సందర్శించారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు కల్పించాల్సిన సౌకర్యాలపై పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు ఎటువంటి ఆటంకం కలగకుండా అన్ని రకాల సౌకర్యాలను కల్పించడంతో పాటు పగడ్బందీగా పరీక్షల నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన చెప్పారు.



తరగతి గదిని పరిశీలిస్తున్న డిఇఒ

గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు

▸▸ జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ▸▸ 104 అంబులెన్స్ లు ప్రారంభం



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్, పిఒ, ఎమ్మెల్యే,

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఫ్యామిలీ డాక్టర్ విధానంలో గిరిజన ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. సోమవారం ఐటిడిఎ కార్యాలయం ఆవరణలో జిల్లాకు కొత్తగా మంజూరైన 104 అంబులెన్సులను పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలక్రిష్ణతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతీ పిహెచ్‌సిలో ఇద్దరు వైద్యులున్నారని, ఒకరు సచివాలయం పరిధిలో వైద్య సేవలు అందించేలా చర్యలు చేపట్టామన్నారు. బిపి, షుగర్ ఇతర కమ్యూనికబుల్ డిసీజెస్‌తో బాధపడుతున్న రోగులకు రెగ్యులర్ చెకప్ చేస్తారన్నారు. గర్భిణీలు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. నవజాత శిశు సంరక్షణ సేవలు అందిస్తారన్నారు. అంగన్వాడీ సెంటర్లు సందర్శించి రక్తహీనతతో బాధ పడుతున్న పిల్లల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి వైద్యం అందిస్తారన్నారు. పిహెచ్ సిలలో 90 శాతం ఖాళీలను భర్తీ చేసామని తెలిపారు. అరకు, చింతపల్లి ఏరియా ఆసుపత్రులలో శస్త్ర చికిత్సలు చేయడానికి అన్ని ఏర్పాట్లు చేసామన్నారు. తలసేమియా, సికిల్ సెల్ ఎనిమియాతో బాధపడే వారు జిల్లా ఆసుపత్రికి వచ్చి వైద్య పరీక్షలు చేయించు కోవాలని సూచించారు. 15 మందికి సికిల్ సెల్ ఎనిమియాను గుర్తించామని మెరుగైన వైద్యంతో పాటు పింఛనులు అందించడానికి చర్యలు చేపట్టామని చెప్పారు. వచ్చే మూడు నెలలో రెండు వేల మందికి సికిల్ సెల్ ఎనిమియా పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ,

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వైద్యరంగానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. వైద్య ఆరోగ్య సేవలకు అత్యధిక నిధులు కేటాయిస్తున్నారని చెప్పారు. ప్రతీ ఒక్కరికి నాణ్యమైన వైద్యం అందించాలని లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. పాడేరు ఐటిడిఎ పరిధిలోని ప్రతీ మండలానికి రెండు 104 అంబులెన్సులు ఉన్నాయన్నారు. ఫ్యామిలీ ఫిజిషియన్ విధానం ద్వారా ఇంటింటికి వైద్య సేవలు అందుతున్నాయన్నారు. జికె వీధి (ధారకొండ)కు అరకువ్యాలీ, ముంచింగిపుట్టు, పాడేరు మండలాలకు కొత్త అంబులెన్సులు అందుబాటులోకి వచ్చాయన్నారు. పాడేరులో మరొక అంబులెన్సు రిజర్వులో ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఒ డా.జమాల్ బాషా, డిటిసిఒ టి.విశ్వేశ్వరనాయుడు, ఎంపిపి ఎస్.రత్నకుమారి, 104 జిల్లా మేనేజర్ ఎన్.మురళి తదితరులు పాల్గొన్నారు.



దీక్ష చేపడుతున్న గ్రామస్తులు, నాయకులు

వైసిపి కార్యాలయ పనులు ఆపాలి

గిరిజన సంఘం ఆధ్వర్యంలో రిలే దీక్షలు

ప్రజాశక్తి-పాడేరు:మండలంలోని చింతలవీధి పంచాయతీ నడింవీటి గ్రామంలో వైసిపి కార్యాలయ నిర్మాణ పనులను తక్షణమే నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో గ్రామస్తులు సోమవారం సంఘటనా స్థలం వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, 2 ఎకరాల రైతుల సాగు భూమిని ఆ పార్టీకి చట్ట విరుద్ధంగా కేటాయించారని, దీని అనుమతులను రద్దు చేయాలన్నారు. గత ఏడాది దీన్ని వ్యతిరేకిస్తూ గ్రామస్తులు నిర్వహించిన గ్రామ సభలో వ్యతిరేక తీర్మానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా నాయకులు లింగేరి సుందరరావు మాట్లాడుతూ, తక్షణమే ఈ విషయంపై జిల్లా కలెక్టర్, ఏపిఓ స్పందించి వైసీపీ కార్యాలయం నిర్మాణపు పనులను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ భూమిలో భూమిలో నడిం వీధి గ్రామానికి చెందిన వారు కాఫీ, సిలర్ మొక్కలు సాగు చేసుకొని జీవనాధారం పొందుతున్నారని తెలిపారు. స్థానిక గిరిజన ప్రజల అభిప్రాయంతో సంబంధం లేకుండా ఇష్టానుసారంగా జీవో 354 జారీ చేసి, షెడ్యూల్డ్ ఏరియా నిబంధనలను తుంగలో తొక్కారని విమర్శించారు. తక్షణమే నిర్మాణ పనులు నిలుపుదల చేయకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు ఎం.బాలన్న, బిమన్న, రాజు, సతీష్, మహేష్, పొల్లన్న, సుమన్, వెంకటరావు, నడుంవీది, ఉబ్బెటి పుట్టు గ్రామస్తులు పాల్గొన్నారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న డిపిఒ కొండలరావు

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం సీలేరు మేజర్ పంచాయతీ పారిశుభ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని అల్లూరి సీతారామరాజు జిల్లా పంచాయితీ అధికారి టి.కొండలరావు కార్యదర్శి శ్రీనివాస్‌ను ఆదేశించారు. శనివారం సీలేరు పంచాయతీ, సచివాలయాలను సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రంలో ఎంతమంది పిల్లలు ఉన్నారు, డ్రాప్ అవుట్స్ ఎంతమంది తదితర వివరాలను సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ లోవ కుమారిని అడిగి తెలుసుకున్నారు. డిజిటల్ అసిస్టెంట్ విజయ కుమారిని ప్రజలకు ఏఏ సేవలు అందిస్తున్నారని అడిగారు. అనంతరం ఇన్చార్జి సర్పంచ్ కే.వల్లి ప్రసాద్ ఎంపీటీసీ పిల్ల. సాంబమూర్తి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లతో సమావేశం నిర్వహించారు. పన్నులు వసూలు చేయకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. వచ్చే నెల 10వ తేదీ కల్లా పూర్తిస్థాయిలో పన్నులు వసూలు చేసి రికార్డులు ఆధునికీకరణ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పాంగి లూసి, వార్డు సభ్యుడు చిటికెల రాము పాల్గొన్నారు.

నకిలీ పోలీసు అరెస్ట్

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : నకిలీ పోలీస్‌ను సోమవారం అరెస్ట్ చేసినట్లు రాజవొమ్మంగి ఎస్ఐ టీజీ నరేంద్ర ప్రసాద్ తెలిపారు. తను పోలీస్ కానిస్టేబుల్ అని, లాగరాయి వెళ్ళిరావాలని ఈ నెల 23న తన బైక్‌ను ఒక వ్యక్తి తీసుకెళ్లాడని, ఆ వ్యక్తి తిరిగి రాలేదని జిల్లాలోని కొయ్యూరు మండలం రాజేంద్రపాలెం గ్రామానికి చెందిన ప్రసాద్ అనే వ్యక్తి స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగిందని ఎస్ఐ తెలిపారు. ఈ నేపథ్యంలో తమకు అందించిన సమాచారం మేరకు ఈనెల 26న రాజవొమ్మంగి గ్రామ శివారున బైక్‌తో పాటు నకిలీ పోలీస్ అయిన శంఖవారం మండలం వేలంగి గ్రామానికి చెందిన వెలుగుల వెంకటరమణను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. వెంకటరమణ తను పోలీస్ అని పలువురుని మోసం చేశాడని, కాకినాడ, నక్కపల్లి, శ్రీకాకుళం, ఏలూరు, సత్తెనపల్లి వంటి పలు ప్రాంతాల్లో నేరాలు చేసి జైలుకి వెళ్లి వచ్చాడని ఎస్ఐ తెలిపారు. నిందితుడు వెంకటరమణపై ఐపీసీ 406,409 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.



స్వాధీనం చేసుకున్న బైక్, పట్టుబడిన నకిలీ పోలీసులతో పోలీసులు



విల్లులను ఎక్కుపెడుతున్న నాయకులు

బోయ/వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడంపై..

మన్యంలో ఆందోళనలు

ప్రజాశక్తి-పెదబయలు:బోయ/వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు అసెంబ్లీలో. చేసిన తీర్మానం వెనక్కి తీసుకోవాలని మండల కేంద్రంలో సోమవారం గిరిజన సంఘం, గిరిజన అఖిల పక్షం అధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. జిల్లా పరిషత్ అతిథి గృహం నుండి పోలీసు స్టేషన్ వరకు అర్థ నగ్న ప్రదర్శన చేశారు. విల్లంబులు చేతబట్టి ముఖ్యమంత్రి, గిరిజన ఎమ్మెల్యే ల్లారా ఖబడ్దార్ అంటూ భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ కూడలి జంక్షన్ వద్ద మానవ హారం ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి దిష్టి బొమ్మను దహనం చేసేటప్పుడు పోలీసులు నిలువరించారు. అనంతరం సంప్రదాయ బద్ధంగా దహనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మ పృధ్వీరాజ్ మాట్లాడుతూ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో విద్యా వంతులు, సొంత పార్టీ ఎమ్మెల్యేలు వ్యతిరేకించిన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి బుద్ధి రాలేదని తెలిపారు. గిరిజన నిరుద్యోగులకు వందకు వంద శాతం ఉద్యోగాలు కల్పించే జిఓ 3పై ఎందుకు రివ్యూ పిటిషన్ దాఖలు చేయలేదన్నారు. ఎమ్మెల్యే, ఎంపిలకు భవిష్యత్తులో రాజకీయంగా పుట్ట గతులు ఉండవన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకుడు, మాజీ ఎంపిపి వి కొండయ్య మాట్లాడుతూ, అసెంబ్లీలో చేసిన తీర్మానం ఉప సంహరించుకోకుంటే పోరాటం ఉధృతం చేస్తామన్నారు. ఈనెల 31న జరిగే రాష్ట్ర వ్యాప్త మన్యం బందును జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బోండా సన్నిబాబు, సీఐటీయూ కార్యదర్శి కె.శరబన్న, వైస్ ప్రెసిడెంట్ బి గంగాదరం, జెఏసీ నాయకుడు పోతురాజు, రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి భూషన్, రవి కుమార్, జనసెన నాయకుడు ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: అసెంబ్లీలో పెట్టిన తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలని మండల కేంద్రంలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. వైస్ ఎంపీపీ సుడిపల్లి కొండరావు, గిరిజన సంఘం మండల కార్యదర్శి టి.క్రిష్ణా రావు మాట్లాడుతూ, బోయ,వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్చెటప్పుడు మన గిరిజన ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు కనీసం నోరు మెదపక పోవడం వెనుక అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. గిరిజన, ప్రజా సంఘాలు, ఆదివాసీలంత ఒక్క వేదికపైకి వచ్చి ఉద్యమాన్ని ఉధతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వి.లక్ష్మణ్ రావు, ఐద్వా సంఘం నాయకులు ఎస్.హైమావతి, జి.ఆనంద్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యేల చిత్రపటం వద్ద నిరసన చేపడుతున్న నాయకులు

గ్రామాల అభివృద్ధికి కృషి

సర్పంచ్ ఎస్. రూతు

ప్రజాశక్తి -అనంతగిరి:అనంతగిరి పంచాయతీలో గ్రామాల అభివృద్ధికి కృషి చేసేందుకు ప్రణాళికతో ముందుకు అడుగులు వేస్తున్నట్లు సిపిఎం సర్పంచ్ సోమ్మెల రూతు అన్నారు. సోమవారం స్థానిక సచివాలయ కేంద్రంలో వార్డు సభ్యులు, సచివాలయం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పంచాయతీ పరిధి గ్రామాల్లో సందర్శించి సమస్యలను తెలుసుకుని అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఆమె అన్నారు. ఇంటి పన్నులు వేగవంతంగా వసూలు చేయాలన్నారు. తాడిగూడ గ్రామానికి తాగునీటి ట్యాంక్ మరమ్మత్తు పనులు రూ 60.వేలు, పెద్దూరు గ్రామానికి పైప్ లైన్ రూ.5 లక్షలు, జడ్పీ నిధుల కింద రాజు పాక గ్రామానికి తాగునీటి పైప్లైన్ ట్యాంకు మరమత్తుకు రూ. 5లక్షలు, బొడ్డచెట్టు కాలనీ అంగన్వాడి భవనానికి రక్షణ గోడ కు లక్ష 80 వేలు, అనంతగిరి గ్రామానికి సిసి రోడ్డుకు రూ. 3. లక్షలు, తాడిగూడ పైప్లైన్‌కు రూ. 2. లక్షలు మరిన్ని గ్రామాలకు ప్రతిపాదనలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పాంగి. అర్జున్, వార్డు మెంబర్లు జె.సుబ్బారావు, వెంకటరావు, సెక్రెటరీ. శ్రీనివాస్ రెడ్డి, సచివాలయం సెక్రటరీ. జోగారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సర్పంచ్

గ్రంథాలయానికి పుస్తకాలు

ప్రజాశక్తి- పెదబయలు :స్థానిక శాఖా గ్రంధాలయంకు వివిధ పోటీ పరీక్షలకు సంబందించిన సుమారు 43 పుస్తకాలు సరఫరా అయినట్లు గ్రంధాలయాధికారి ఓ.శ్రీనివాసరావు తెలిపారు. పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే విద్యార్థులు ఈ పుస్తకాలను ఉపయోగించు కోవాలని గ్రంధాలయాధికారి కోరారు.

8 నుంచి ఆలయ వార్షికోత్సవాలు

ప్రజాశక్తి-హుకుంపేట:మండలంలోని తడిగిరి పంచాయతీ ఉక్కుర్భ గ్రామంలో భీమలింగేశ్వరస్వామి దేవాలయం వార్షికోత్సవాలు ఏప్రిల్ 8,9,10, తేదీలలో ఘనంగా నిర్వహించుటకు ఆలయ కమిటీ, ఆరు గ్రామాల పెద్దలు నిర్ణయించారు. సోమవారం ఉదయం ఆలయ ప్రాంగణంలో ఉక్కుర్భ, ఒంటిపుట్టు, ం క ని రా ం ం ం, ఇసుకగరువు, పొందెలి, పత్రిమెట్ట, తదితర ఆరు గ్రామాల పెద్దలు, ఆలయ కమిటీ ప్రతినిధులు, ఆలయ కమిటీ గౌరవాధ్యక్షులు లకే చిట్టిబాబు ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి తీర్మానించారు. ఈ మేరకు ఆలయ కమిటీ గౌరవాధ్యక్షులు లకే చిట్టిబాబు మాట్లాడుతూ, ఏప్రిల్ 8న ఉక్కుర్భ గ్రామ దేవత సంకుదేవునికి పూజలు చేసి ఆరు గ్రామాల మీదుగా భారీ ఊరేగింపుతో భీమలింగేశ్వరస్వామి ఆలయానికి చేరుకొని ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం అవుతాయన్నారు. 9న ప్రత్యేక పూజలు, అన్నదానం, 10న శివహోమం, గిరిజన కళాకారులతో భజన మరియు వివిధ కార్యక్రమాలు ఏర్పాటు చేయడానికి సిద్ధం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ కన్వీనర్, ఎంపీటీసీ తడిగిరి పరదాని భీమలిగేశ్వరరావు, ఆలయ ప్రధాన కార్యదర్శి పూజారి రాంబాబు, ముఖ్య సలహాదారు లకే సూరిబాబు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన కమిటీ సభ్యులు, పెద్దలు

31న మన్యం బంద్ విజయవంతం చేయాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి-అనంతగిరి

బోయ/వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చవద్దని ఈనెల 31వ తేదీన జరిగే మన్యం బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ ప్రజా సంఘాల నేతలు కోరారు. ఈ మేరకు గిరిజన సంఘం కార్యాలయం వద్ద సోమవారం గిరిజన సంఘం, ఉపాధ్యాయ, మహిళ సంఘం, సిఐటియు, ప్రజా సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. సిఐటియు మండల కార్యదర్శి కె.మొస్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు, స్థానిక జెడ్పిటిసి దీసరి గంగరాజు మాట్లాడుతూ, బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరుస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి శాసనసభలో మాట్లాడటం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. అన్ని రంగాలలో ఉన్నత స్థాయిలో ఉన్న బోయ/వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చి చిచ్చు పెట్టడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై గిరిజనులంతా ఏకమై పోరాటానికి సన్నద్ధం కావాలని, ఈనెల 31న మన్యం బందును విజయవంతానికి గిరిజనులు అంతా కదిలి రావాలని ఆయన పిలుపునిచ్చారు.

గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు డి. సన్యాసిరావు, గురుదొరలు మాట్లాడుతూ, ఎస్టీ జాబితాలో బోయ వాల్మీకులను చేర్చే ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే మానుకోవాలన్నారు. గిరిజనులంతా ఏకమై మన హక్కులు, చట్టాలు కాపాడుకునేందుకు పోరాటం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అనంతగిరి సర్పంచ్ సోమెల. రూతు, గిరిజన సంఘం మండల నాయకులు ఎస్.నాగులు, జె. సుబ్బారావు, మహిళా సంఘం నాయకురాలు బి.కాసులమ్మ, డి దేవుడమ్మ, ఉప సర్పంచ్ అర్జున్, ఉద్యోగ, ప్రజా సంఘాల నాయకులు సిఎస్ మురళి తదితరులు పాల్గొన్నారు.

అరకులోయరూరల్ : బోయ/వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు ప్రభుత్వం చేసిన తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ 31న రాష్ట్ర మన్యం బంద్ విజయవంతం చేయాలని అరకువేలి మండల కేంద్రంలోని డిగ్రీ కళాశాల, రవ్వలగుడ, శరభగుడ, కంతబంసుగుడ, సి.కాలని, యండపలివలస ప్రాంతంలో గిరిజన సంఘం నాయకులు విస్తతంగా ప్రచారం నిర్వహించారు. రాజ్యాంగంలోని ఎస్టీ జాబితాలో రిజర్వేషన్లను కల్పించారన్నారు. గతంలో టిడిపి ప్రభుత్వం కుడా అసెంబ్లీలో తీర్మానం చేసిందని, జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం రిజర్వేషన్లను తుంగలో తొక్కి కుట్ర పన్నుతుందని విమర్శించారు. రాజకీయ లబ్ధి కోసమే ముఖ్యమంత్రి గిరిజన ప్రజానీకానికి ద్రోహం చేస్తున్నారన్నారు. బంద్‌ను ఉద్యోగులు, ఉపాధ్యాయులు, మేధావులు. వివిధ ప్రజా సంఘాల నేతలు విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు తామల జోషి, గిరిజన సంఘం మండల కార్యదర్శి పాంగి రామన్న, అధ్యక్షులు గత్తుం బుజ్జిబాబు, కిండంగి రామారావు పాల్గొన్నారు.



ఏనురాళ్లపల్లిలో నిరసన తెలుపుతున్న గిరిజన సంఘం నాయకులు, గిరిజనులు

దుంబ్రిగూడ : బోయ,వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్పిస్తే సహించేది లేదని టిడిపి రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు సివేరి దొన్నుదొర హెచ్చరించారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, తీర్మానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జీవో 3 ను రద్దు చేసినా స్పందించని వైసిపి ప్రభుత్వం ఎస్టీ జాబితాలో చేర్పించడానికి తీర్మానించడం సరికాదన్నారు. దీనిపై గిరిజన ఎమ్మెల్యేలు తమ వైఖరిని స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దీనిని నిరసిస్తూ ఈనెల 31న గిరిజన సంఘాలు, జేఏసీ పిలుపునిచ్చిన రాష్ట్ర వ్యాప్త బంద్‌కు సంపూర్ణ మద్దతు పలుకుతున్నామని, గిరిజనులు, ఉద్యోగులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు టి.సుబ్బారావు, జిల్లా నాయకుడు కే సుబ్బారావు, నాయకులు పాల్గొన్నారు.

రంపచోడవరం : బోయ వాల్మీకి, బెంతు ఒరియాలను ఎస్టీ జాబితాలోకి చేర్చుతూ అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం చేయడాన్ని నిరసిస్తూ ఈనెల 31న జరిగే రాష్ట్ర వ్యాప్త మన్యం బంద్‌కు జయప్రదం చేయాలని పలువురు వ్యక్తలు పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో కంగల శ్రీనివాస్ అధ్యక్షతన సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. వైయస్ జగన్మోహన్ రెడ్డి ఏక సభ్య కమిషన్ నియమిస్తూ జిఓ నెంబర్ 52 జారీ చేసి బోయ వాల్మీకి బొంత ఒరియా తదితర బీసీ కులాలను ఎస్టీల్లో చేర్చాలన్న ఓటు బ్యాంకు రాజకీయాలను తిరస్కరించాలని, రిజర్వేషన్ల విధానాన్ని రద్దుకు పాలకులు చేస్తున్న కుట్రలను తిప్పి కొట్టాలని, ఏడుగురు గిరిజన ఎమ్మెల్యేలు పదవులకు రాజీనామాలు చేయాలని డిమాండ్ చేశారు, ప్రభుత్వ సంస్థలు, కార్యాలయాలు, విద్యా సంస్థలు, ఆటో, రవాణ రంగాలలో బంద్‌కు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు, జిల్లా అధ్యక్షులు ఈతపల్లి సిరిమల్లె రెడ్డి, విద్యాసాగర్, పలు సంఘాల నాయకులు వీక బుల్లి కొండలు దొర, కుంజం సత్య నారాయణమ్మ, వంజం జోగారావు, కుంజం సిద్దు, పోడియం పండుదొర, కత్తుల ఆదిరెడ్డి, మడకం ప్రసాద్, కోసు అచ్చిబాబు, కారం రామన్నదొర, పకీరుదొర, వరలక్ష్మి, వంతు బాలకృష్ణ, తోడం వెంకటేష్, కంగల అబ్బాయి దొర పాల్గొన్నారు.

చింతూరు : బోయ వాల్మీకి బెంతు ఒరియాలను ఎస్టీ జాబితాలో కలపాలని రాష్ట్ర అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని తక్షణమే ఉపసంహరించాలని గిరిజన సంఘం జిల్లా నాయకురాలు మల్లం సుబ్బమ్మ డిమాండ్ చేశారు. సోమవారం నాడు ఏడుగురాళ్లపల్లి కేంద్రం వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన నాయకులు సోలం కన్నయ్య దేసయ్య, సవలం వెంకయ్య సవలం విజయ. కనితి సమ్మయ్య, పోడియం రాధా సవలం రాదా, పార్వతి, సవలం పుష్ప పాల్గొన్నారు.



అరకులోయలో ప్రచారం చేస్తున్న గిరిజనులు



రంపచోడవరంలో రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న వివిధ సంఘాలు, పార్టీల నాయకులు

బంద్‌కు సిపిఎం మద్దతు

ప్రజాశక్తి-విఆర్.పురం

బిసిలుగా ఉన్న బోయ వాలీకి, బెంతు ఒరియాలను ఎస్టీ జాబితాలోకి చేర్చుతూ అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం చేయడాన్ని నిరసిస్తూ ఈనెల 31న జరిగే రాష్ట్ర వ్యాప్త మన్యం బంద్‌కు సిపిఎం సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు ఆ పార్టీ మండల కార్యదర్శి సోయం చిన్నబాబు చెప్పారు. మండలంలోని రేఖపల్లి సిపిఎం కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్టీలకు ఉన్న చాలా రకాల రిజర్వేషన్లు తీసివేశారు, జీవో నెంబర్ 3ను రద్దు చేశారని తెలిపారు. ఇటువంటి తరుణంలో బోయ వాల్మీకిలను ఎస్టీ జాబితాలో కలపడం ఏమిటని ప్రశ్నించారు. నిజంగా ప్రభుత్వానికి ఆదివాసీల మీద ప్రేమ ఉంటే ఇలాంటి నిర్ణయాలు తీసుకోదన్నారు. దీనిపై ఆదివాసీ ఎమ్మెల్యేలు మాట్లాడకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కు తీసుకునే వరకూ పోరాటం ఉధృతంగా చేస్తామని హెచ్చరించారు.

మన్యం బంద్‌ను విజయవంతం చేయండి

సీలేరు : బోయ వాల్మీకి , బొంతులను ఎస్టీ జాబితాలో చేర్చాలని శాసనసభలో తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 31న జరగనున్న రాష్ట్ర బందును విజయవంతం చేయాలని గాలికొండ ఎంపీటీసీ అంపరంగి బుజ్జిబాబు పిలుపునిచ్చారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని ఉద్యోగులు, వ్యాపార వాణిజ్య, రవాణా, హోటల్ యజమానులు, గిరిజనులు బంద్‌కు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల అధ్యక్షుడు మురళి చంటి బాబు, రామారావు లాకే రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



క్షయ నిర్ధారణ యంత్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

పక్కాగా క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి- హుకుంపేట: క్షయ నిర్ధారణ పరీక్షలు పక్కాగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ స్పష్టం చేశారు. హుకుంపేట పిహెచ్‌సికి ఐసిఎంఆర్, గీతం మెడికల్ కళాశాల వితరణ చేసిన రు. 7లక్షల విలువైన క్షయ నిర్ధారణ యంత్ర పరికరాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్షయ రోగులకు మెరుగైన వైద్యం, పోషకాహారం అందించాలని సూచించారు. జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ టి.విశ్వేశ్వర్ నాయుడు మాట్లాడుతూ, వచ్చే నెల ఒకటో తేదీ నుండి హుకుంపేట, పాడేరు, జి.మాడుగుల మండలాల్లో క్షయ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో గీతం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గాయత్రి సాయికుమార్, డాక్టర్ శాంతి, ఎన్‌టిఇపి సదానంద, అనీల్ పాల్గొన్నారు.

సకాలంలో భూముల రీ సర్వే

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలో చేపట్టిన భూముల రీ సర్వే కార్యక్రమం నాణ్యవంతంగా, సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుండి జిల్లాలోని ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారులు, సబ్ కలెక్టర్, మండల తహశీల్దార్లు, సర్వేయర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ, సర్వేలో సమస్యలుంటే తమ దృష్టికి తీసుకు రావాలని, ఎంపిక చేసిన గ్రామాలలో ఈ వారంలోపు సర్వే పూర్తి కావాలని ఆదేశించారు. డి పట్టా భూములను, లబ్ధిదారులను గుర్తించి ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. కొన్ని మండలాల తహశీల్దార్లు అడవుపు లేప్ ట్యాప్ లు కావాలని అడగగా కలెక్టర్ స్పందిస్తూ పంపిస్తామని హామీ ఇచ్చారు. పివిటిజి ఓటర్లకు సంబంధించి 18 వేల ఓటర్లకు గాను సుమారు 12 వేల ఎపిక్ కార్డులు జనరేట్ అయ్యాయని, మిగిలిన ఆరు వేల ఓటర్లను పూర్తి చేసేందుకు సమయం కావాలని పలువురు తహశీల్దార్లు కోరిక మేరకు మరో పది రోజులు సమయం ఇస్తున్నామన్నారు. జిల్లాలో సాధారణ ఓటర్లకు సంబంధించి సుమారు 25 వేల డెత్ కేసులు ఉంటాయని, అందుకు సంబంధించి ఫారం 7 లను బి.ఎల్.ఓ లకు పంపి, సంబంధిత సచివాలయ కార్యదర్శి ద్వారా రుజువు చేసుకొని నామినీ సంతకం తీసుకొని ఓటరు జాబితా నుండి తొలగించే చర్యలు చేపట్టాలన్నారు. ముందుగా ఆ జాబితాలను రాజకీయ పార్టీలకు పంపి అభ్యంతరాలు లేకపోతే తొలగించాలన్నారు. ఈ సందర్భంగా ఓటరు జాబితాలను శత శాతం పూర్తి చేసిన తహశీల్దార్లను కలెక్టర్ అభినందించారు. రేషన్ కార్డులకు సంబంధించి కార్డులో కుటుంబ సభ్యుల చేర్పులు, మార్పులు, తొలగింపులు, విభజనలు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా ప్రధాన కేంద్రం నుండి సంయుక్త కలెక్టర్ జే.శివ శ్రీనివాసు, డిఆర్ఓ పి.అంబేద్కర్, భూ సర్వే రికార్డుల సహాయ సంచాలకులు వై.మోహనరావు, పాడేరు నుండి ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి రోణంకి గోపాలకృష్ణ, సబ్ కలెక్టర్ వి. అభిషేక్, రంపచోడవరం నుండి ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్, తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి ప్రదేశ్‌గా ఎపి : వంగలపూడి

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆంధ్రప్రదేశ్ గంజాయి ప్రదేశ్‌గా మారిపోయిందని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షులు వంగలపూడి అనిత ఆరోపించారు. సోమవారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, అసమర్థ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని గంజాయి, హత్య, అత్యాచార ఆంధ్ర ప్రదేశ్‌గా మార్చేశారని విమర్శించారు.

ప్రత్యామ్నాయ పంటలకు ప్రతిపాదనలు

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి- పాడేరు : జిల్లాలో గంజాయి సాగు పూర్తిగా నిర్మూలించేందుకు ప్రత్యామ్నాయ పంటలకు ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ సూచించారు. సంబంధిత అధికారులతో కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పి సతీష్ కుమార్ జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి మండలంలో గ్రామంలోని ప్రాతిపదికన లబ్ధిదారు పేరు, వేయదలచిన పంట, విస్తీర్ణం తదితర వివరాలతో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. మండల స్థాయిలో వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు, ద్వామా ఎపిడిలు పోలీస్ సహకారంతో కమిటీగా ఏర్పడి సంతకాలు చేసి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. పెద్ద మండలాలలో కనీసం కోటి రూపాయలు, చిన్న మండలాలలో రూ. 50 లక్షలకు తక్కువ కాకుండా ప్రతిపాదించాలన్నారు. వచ్చే నెల 10వ తేదీలోపు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ద్వామా ఎపిడిలు రైతులకు అవసరమైన పంటలకు సంబంధించి ఆయా ప్రాంతాల వాతావరణ, భూసార పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఒక సెల్ఫ్ ఆఫ్ వర్క్స్ తయారు చేయాలని, ఆయా ప్రాంతాల రైతులకు అవగాహన కల్పించి సాగుకు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఏజెన్సీ ప్రాంతాలలో వేగంగా పెరిగే వెదురు, జీడి పప్పు, స్వీట్ ఆరంజ్, జామ, సపోటా, సీతాఫలం, జామూన్ తదితర పంటలను వేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. నర్సరీల ద్వారా సరఫరా చేసే మొక్కల నాణ్యత పరిశీలించాలని ఆదేశించారు. ఇప్పటికే రాజ్మా, కాఫీ పంటలకు ప్రభుత్వ ప్రోత్సాహం లభిస్తోందని, గంజాయి ప్రత్యామ్నాయ పంటలను ఎన్ఆర్ఈజిఎస్‌తో అనుసంధానించి ప్రోత్సాహిస్తామని కలెక్టర్ చెప్పారు.

ఎస్పి సతీష్ కుమార్ మాట్లాడుతూ, వివిధ అంచనాల ప్రకారం సుమారు 13 వేల ఎకరాలలో గంజాయి సాగు ఉండవచ్చని, 50 శాతం పైగా సాగును అందరి సహకారంతో పోలీస్ శాఖ ధ్వంసం చేయడం జరిగిందని తెలిపారు. జీవనోపాధికి గంజాయి సాగుకు ప్రత్యామ్నాయ పంటలను అందించాల్సిందేనని స్పష్టం చేశారు. గత ఏడాది ఏడు వేల పైగా ఎకరాలలో ప్రత్యామ్నాయ పంటలకు సహకారం అందిస్తామని ఎస్పీ స్పష్టం చేశారు.

ప్రాజెక్ట్ అధికారి రోణంకి గోపాల కృష్ణ మాట్లాడుతూ, సీజన్ ప్రారంభం నుండే ఈ కార్యక్రమాలు చేపట్టాలని, ఈ విషయాన్ని గుర్తించి సంబంధిత సిబ్బంది, అధికారులు వేగవంతం చేయాలని ఆదేశించారు. సుమారు లక్ష పైగా ఎకరాలకు అటవీ హక్కులు కల్పించామని, వారిని కూడా ఈ పథకం కింద లబ్ధి కల్పించాలని కోరారు. ఈ జూమ్ సమావేశంలో కలెక్టరేట్ నుండి శిక్షణ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాత్సవ, రంపచోడవరం నుండి ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే, జిల్లా వ్యవసాయాధికారి బి.ఎస్.ఎన్. నంద్, జిల్లా ఉద్యానాధికారి రమేష్ కుమార్, ద్వామా పిడి రమేష్ రామన్, మండల వ్యవసాయ, ఉద్యాన అధికారులు, ఎపిఓలు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ఎమ్మెల్యేల వైఖరిని ప్రకటించాలి

గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.అప్పలనర్స



సమావేశంలో మాట్లాడుతున్న అప్పలనర్స

ప్రజాశక్తి-పాడేరు:బోయ/ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడంపై గిరిజన ఎమ్మెల్యేలు, ఎంపీలు తమ వైఖరిని ప్రకటించాలని గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.అప్పలనర్స డిమాండ్ చేశారు. సోమవారం ఆయన గిరిజన సంఘం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, బోయ / వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్పించేందుకు ముఖ్యమంత్రి ప్రవేశ పెట్టిన తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదం పొందిందని, దీనిపై గిరిజనుల ప్రజాసంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో గిరిజన ఎమ్మెల్యేలు తమవైఖరిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై అసెంబ్లీ సమావేశంలో వున్న 7 మంది గిరిజన ఎమ్మెల్యేలు నోరు మెదపలేదన్నారు. గిరిజనుల వాణిని శాసనసభలో ఎమ్మెల్యేలు వినిపించలేకపోయారని విమర్శించారు. బోయ,వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్చిస్తే ఏజెన్సీ ప్రాంత గిరిజనులకు ఎటువంటి నష్టంలేదని అసెంబ్లీ సాక్షిగా అసెంబ్లీలో ముఖ్యమంత్రి మాట్లాడటం సరికాదన్నారు.ఏజెన్సీ ప్రాంతంలో భూమి, అడవిపై ఆదివాసులకే క్రయ, విక్రయాలకు హక్కు ఉందని, బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చితే ఇక్కడి భూములు అన్యాక్రాంతం అవుతాయన్నారు. 5వ షెడ్యూల్ ఏరియాలో ఇప్పటికే 7 అసెంబ్లీ స్థానాలు, 1 పార్లమెంట్ స్థానం గిరిజనులకు రాజకీయ రిజర్వేషన్లు రాజ్యాంగం కల్పించిందని, ఆ స్థానాల్లో బోయ,వాల్మీకులకు గిరిజన ప్రాతినిధ్యంలాగా పోటీ చేయడానికి అర్హత పొందుతారని పేర్కొన్నారు. వివిధ రాజకీయ పార్టీలు గిరిజన సహజ సంపదను దోచుకోవాలని బోయ, వాల్మీకులను ఎస్టీల్లో పోటీచేయడానికి అవకాశం కల్పిస్తే గిరిజనుల అస్తిత్వానికి ప్రమాదం ఏర్పడుతుందన్నారు. గిరిజన సలహామండలి సమావేశాన్ని వెంటనే ఏర్పాటు చేసి జాబితాలో చేర్చవద్దంటూ తీర్మానం చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సిఫార్సు చేయాలని డిమాండ్ చేశారు. హైడ్రోపవర్ ప్రాజెక్టు అనుమతులు రద్దు చేసి, పోలవరం నిర్వాసితులను ఆదుకోవాలన్నారు. ఈ సమావేశంలో గిరిజన సంఘం జిల్లా నాయకులు ఎల్.సుందరరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టీమ్‌ను సత్కరించిన డిఆర్ఎం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఈస్ట్ కోస్ట్ రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్, వాల్తేరు డివిజన్ క్రికెట్ జట్టు వివిధ ఫార్మాట్లలో అద్భుతమైన ఆటతీరును ప్రదర్శించడంతో జట్టును డిఆర్ఎం అనుప్‌కుమార్ సత్పతి సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ ఆఫీసర్ ప్రవీణ్ బాటి, అసిస్టెంట్ స్పోర్ట్స్ ఆఫీసర్లు బి.అవినాష్, ప్రధాన కార్యదర్శి శ్రీరెడ్డి శ్రీనివాస్, టీమ్ కెప్టెన్ ఎంఎస్ దీపక్, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.



గోడ పత్రికను విడుదల చేస్తున్న నాయకులు

5న చలో ఢిల్లీని జయప్రదం చేయాలి

ప్రజాశక్తి -అరకులోయ రూరల్:కార్మికుల సమస్యలు పరిష్కారానికై ఏప్రిల్ 5న చేపట్టే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సోమవారం అరకువేలి గిరిజన సంఘం కార్యాలయంలో సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.బాలదేవ్ మాట్లాడుతూ, కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26,000 ఇవ్వాలని, నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలన్నారు. కాంట్రాక్ట్, అవుట్సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.రైతులు పండించిన ప్రతీ పంటను కనీసం మద్దతు ధర చట్టం తేవాలన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం బడ్జెట్లో 2 లక్షల కోట్లకు పెంచాలన్నారు. రెండు వందల రోజుల పని దినాలు పెంచి కనీస రోజుకు రూ.600 కూలీ ఇవ్వాలని తెలిపారు. పెంచిన నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలన్నారు.అటవీ హక్కుల చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు అరకువేలి మండల అధ్యక్ష కార్యదర్శులు ఎస్ ప్రభుదాస్, జె.భగత్‌రామ్, నాయకులు రాజు, కొండలరావు, జోషి, సుబ్బారావు పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు:కార్మిక, కర్షకుల పట్ల నరేంద్ర మోడీ వ్యవహరిస్తున్న తీరును వ్యతిరేకిస్తూ మండల కేంద్రంలో కళ్యాణ మండపం ఆవరణలో సిఐటియు కార్యదర్శి కొర్ర శంకర్రావు ఆధ్వర్యంలో సోమవారం చలో ఢిల్లీ కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమన్ని ఉద్దేశిస్తూ ఆయన మాట్లాడుతూ, ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమంలో భాగంగా జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న మహా ధర్నాకు కార్మిక, ప్రజా సంఘాలు మద్దతు ఇవ్వాలని కోరారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పన, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగస్తులకు కనీస వేతనం రూ.26000 ఇవ్వాలన్నారు. నిత్యవసర సరుకులు ధరలు తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమానికి, ఎస్ రాజు ఎం.శంకర్, సోనియా ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కొయ్యూరు : ఏప్రిల్ 5వ తేదీన నిర్వహించనున్న ఛలో ఢిల్లీని జయప్రదం చేయాలని కోరుతూ ముద్రించిన పోస్టర్‌ను సోమవారం సిఐటియు నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ నూకరత్నం, సత్యవతి వెంకటలక్ష్మి, చిన్నారి, కొమ్మిక డేగలపాలెం, వర్కర్స్, గిరిజన సంఘం నాయకులు ఎస్.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిఐటియు నేతలు

బాదంగీర్ సాయికి 'సంగమం' ఉగాది పురస్కారం

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : హైదరాబాద్‌కు చెందిన సంగమం సంస్థ పాతికేళ్ల ప్రస్థానంలో భాగంగా నిర్వహించిన శోభకత్ నామ సంవత్సర ఉగాది పురస్కారాన్ని బాదంగీర్ సాయి అలియాస్ ఎవివిఎస్.మూర్తికి అందించింది. హైదరాబాద్ లక్డీకాపూల్‌లోని హోటల్ సెంట్రల్ కోర్టు ప్రాంగణంలో ఉగాది అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో బాదంగీర్ సాయికి సంగమం సంస్థ అధినేత సంజయ్ కిశోర్ ఆయనకు పురస్కారాన్ని అందజేశారు.

రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి -జి.మాడుగుల: మండలంలో బోయితిలి పంచాయతీ చదురుమామిడి గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణ పనులను సోమవారం స్థానిక సర్పంచ్ ఎల్ మాలన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సుమారు రూ.40 లక్షలతో ఈ రోడ్డు నిర్మాణం జరుగనుందని, దీంతో చుట్టూ పక్కల గ్రామాలకు రవాణా సదుపాయం కలుగుతుందని తెలిపారు. నిర్మాణ పనుల్లో నాణ్యత లోపం ఉండకూడదని కాంట్రాక్టర్‌కు సూచించారు.



చదురుమామిడిలో సిసి రోడ్డు నిర్మాణ పనులు

29న జాబ్‌మేళా

ప్రజాశక్తి -కంచరపాలెం : ఉపాధి, శిక్షణ శాఖ నిర్దేశించిన నెలవారి కార్యక్రమాలలో భాగంగాకంచరపాలెంలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈనెల 29న బుధవారం ఉదయం 10 గంటలకు జిల్లాలోని వివిధ కంపెనీలలో 580 ఖాళీల భర్తీకి జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి కె సుధా (టెక్నికల్) ఒక ప్రకటనలో తెలిపారు. డెక్కన్ ఫైన్ కెమికల్స్ సంస్థలో ట్రైనీ కెమిస్ట్ 250 ఉద్యోగాలు ఖాళీల భర్తీకి బిఎస్‌సి కెమిస్ట్రీ/డిప్లమో కెమికల్ అర్హత కలిగి, 27ఏళ్లలోపు పురుష అభ్యర్థులు అర్హులన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.19,744 జీతం, పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు ఉంటాయన్నారు.

సినర్జీస్ కాస్టింగ్ లిమిటెడ్ సంస్థలో ట్రైనీ/ఆపరేటర్ ట్రైనీలుగా 300 ఖాళీల భర్తీకి ఏదైనా ఐటిఐ, డిప్లమో అర్హత కలిగిన 19 -35 ఏళ్ల అభ్యర్థులు అర్హులని, నెలకు రూ.11వేలు నుంచి రూ.12వేలు వేతనం, పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు ఉంటాయన్నారు.

మ్యాక్స్ ఫాషన్స్ సంస్థలో క్యాషియర్/సేల్స్ స్టాప్ ఉద్యోగాలు 30 ఖాళీల భర్తీకి ఇంటర్, ఏదైనా డిగ్రీ అర్హత కలిగిన 18-35 ఏళ్ల అభ్యర్థులు అర్హులని, నెలకు రూ.12వేలు వేతనం, పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు కల్పిస్తారన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ncs.gov.in వెబ్‌సైట్‌లో తమ వివరాలను నమోదు చేసుకుని, బయోడేటా సర్టిఫికెట్లతో జాబ్‌మేళాలకు రావాలని సూచించారు.

నైపుణ్యాభివృద్ధితో బంగారు భవిష్యత్

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : అత్యంత పోటీ ప్రపంచం యువతను ఆహ్వానం పలుకుతోందని ఎయు విసి ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి అన్నారు. సోమవారం ఎయు వైవిఎస్ మూర్తి ఆడిటోరియంలో నిర్వహించిన ఇసిఇ విభాగ దినోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ నేటితరం డిగ్రీలతో పాటు నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. అనంత శక్తి విద్యార్థుల సొంతమని, మస్తిష్కంలో ఉద్భవించే ఆలోచనలను ఆచరణలో చూపాలన్నారు. భవిష్యత్ నాయకులుగా నేటితరం యువతను మలచాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతికత విస్ఫోటనం సవాళ్లను విసురుతోందని, వీటికి పరిష్కారాలు చూపే సామర్థ్యాలను యువత కలిగి ఉండాలని సూచించారు. భవిష్యత్ జీవితానికి అవసరమైన జ్ఞానాన్ని నైపుణ్యాలను విద్యార్థులకు అందించే దిశగా ఆచార్యులు కృషి చేయాలని సూచించారు.

ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావు మాట్లాడుతూ ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్, మెషీన్ ఇంటిలిజెన్స్ రంగాలు సమాజంపై అత్యంత ప్రభావాన్ని చూపుతాయన్నారు. ఈ రంగంలో ఇసిఇ విద్యార్థులు అడుగిడాలన్నారు. ఎయు పూర్వ విసి జిఎస్ఎన్‌రాజు మాట్లాడుతూ స్టార్టప్, ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్ రంగాలలో ఎయు సాధిస్తున్న ప్రగతి ప్రశంసనీయమన్నారు. జివిపి కళాశాల డీన్ ఆచార్య కె.రాజరాజేశ్వరి మాట్లాడుతూ నూతన కోర్సులను ప్రారంభించి, సమర్థవంతంగా నిర్వహిస్తూ జాతీయ స్థాయిలో ఎయు మంచి గుర్తింపును సంపాదించుకుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు, పి.రాజేష్ కుమార్, ఆచార్య కె.శ్రీరామకృష్ణ, డాక్టర్ అనూరాధ, అరుణ పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయ సేకరణ ఏర్పాట్లు పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి -సీలేరు : జికె.వీధి మండలం సీలేరు సమీపంలో పార్వతి నగర్ వద్ద నెలకొల్పనున్న పంపు స్టోరేజ్ ప్రాజెక్టుపై ఏప్రిల్ 1న జరగనున్న ప్రజా అభిప్రాయ సేకరణకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్న ఫుడ్ బాల్ గ్రౌండ్ స్థలాన్ని సోమవారం ఎపి జెన్‌కో చీఫ్ ఇంజనీరు బి.శ్రీధర్ సోమవారం పరిశీలించారు. స్థానిక ఎస్సీ సివిల్ కేకేవి. ప్రశాంత్ కుమార్, ఏడిఈ (క్యాంపు) అప్పలనాయుడుని ఏర్పాట్లు ఉగురించి అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి లోపాలు తలెత్తకుండా చూడాలని సూచించారు. సీలేరు పరిసర ప్రాంతాల్లో ఎన్ని గ్రామాల నుంచి ప్రజలు హాజరవుతారు, వారికి భోజన సౌకర్యాలు ఏర్పాట్లుపై ఆరా తీశారు. ప్రజా అభిప్రాయ సేకరణకు వచ్చిన వారికి ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఈలు లక్ష్మీనారాయణ, వరప్రసాద్ పాల్గొన్నారు.

జెన్‌కో అధికారులతో జెఎసి నాయకుల సమావేశం

సీలేరు ఏపీ జెన్కో ఎస్ ఈ కార్యాలయంలో సోమవారం చీఫ్ ఇంజనీర్ బి.శ్రీధర్ ఎస్ఇ సివిల్ ప్రశాంత్ కుమార్‌తో ఎంపీటీసీ పిల్ల సాంబమూర్తి, ఇన్చార్జి సర్పంచ్ కే .వల్లి ప్రసాద్, జెఎసి నాయకులు సన్యాసిరావు, చిటికెల రాము, జి .పిలోన్ సోమవారం సమావేశమయ్యారు. పంపు స్టోరేజ్ ప్రాజెక్టుపై జేఏసీ నాయకులు తమ డిమాండ్లను తెలియజేశారు. దీనికి స్పందించిన చీఫ్ ఇంజనీర్ శ్రీధర్ పంపు స్టోరేజ్ నిర్మాణం వల్ల సీలేరులో ఎవరికి ఎటువంటి సమస్యలు తలెత్తవని తెలిపారు. జెఎసి నాయకులు నక్క తిరుమలరావు పాల్గొన్నారు.

స్పందన అర్జీలను వెంటనే పరిష్కరించాలి

ప్రజాశక్తి - రంపచోడవరం : స్పందన కార్యక్రమానికి వచ్చే అర్జీలను వెంటనే పరిష్కరించాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుండి 24 దరఖాస్తులు అందాయి. వాటిని పిఒ గనోరేతో పాటు సబ్ కలెక్టర్ శుభం బన్సల్, ఐటీడీఏ ఎపీఓ సిహెచ్.శ్రీనివాసరావు స్వీకరించారు. మారేడుమిల్లి, వై.రామవరం మండలాల్లో గిరిజన రైతులకు రబ్బర్ మొక్కలు సరఫరా చేయాలని, ఉపాధి హామీ పథకం ద్వారా రబ్బర్ మొక్కలకు గోతులు తవ్వడం, జంగిల్ క్లియరెన్స్, కంచె ఏర్పాటు చేయాలని, దేవీపట్నం మండలం శరభవరం గ్రామంలో వ్యవసాయ బోర్లకు సాగునీటి కోసం కరెంటు సౌకర్యం కల్పించాలని, అడ్డతీగల మండలం మట్లపాడు గ్రామం నుండి బడదము గ్రామం వరకు ఆరు కిలోమీటర్లకు మెటల్ రోడ్డు ఏర్పాటు చేయాలని, మట్లపాడు. అప్పలపాడు గ్రామాల మధ్యలో కాలువకు కల్వర్టు నిర్మించాలని, వై.రామవరం మండలం గొడుగురాయిలోని సర్వేనెంబర్ 58లో గల భూ సమస్యను పరిష్కరించాలని, రాష్ట్రంలో బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చవద్దని తదితర సమస్యలపై అర్జీలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జాన్ రాజు, డిఎస్ శాస్త్రి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జి.డేవిడ్ రాజు, నాగేశ్వరరావు, ఎండి యూసఫ్, వెలుగు ఏపిడి ఎ.శ్రీనివాసరావు, జిసిసి డిఎం జి.పార్వతీశ్వరరావు, ఏడిఎంహెచ్ఓ డాక్టర్ అనూష, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న పిఒ, ఇతర అధికారులు

నిర్బంధానికి నిరసనగా ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం



ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం చేస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి-విఆర్.పురం : ఈ నెల 20న చలో విజయవాడ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా అక్రమంగా అరెస్టులు చేసి కేసులు నమోదు చేయడాన్ని నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యాన సోమవారం చిన్నమట్టపల్లి- చింతూరు ప్రధాన రహదారిపై ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొమరం పెంటయ్య మాట్లాడుతూ అంగన్‌వాడీల అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మహాధర్నాకు విజయవాడ వెళ్లే వారిని ఎక్కడికక్కడ అరెస్టులు చేయి అక్రమంగా కేసులు బనాయించారని తెలిపారు.

అంగన్ వాడీ వర్కర్లు, ఆయాలను గంటల తరబడి పోలీస్ స్టేషన్లలో నిర్బంధించడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఎం.రాజేశ్వరి, అంగన్వాడీ యూనియన్ జిల్లా నాయకులు ఎస్.రంగమ్మ, ఎస్.సునీత, పి.పుష్ప, ఎం.సునీత, సుజాత, రాములమ్మ, అనూష, సరోజిని, దూలమ్మ, రామలక్ష్మి, పిట్ట లక్ష్మి, రమాదేవి, కనక, చంద్రకళ, సిహెచ్.లక్ష్మి, రోజా, నాంచారి, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో 'పోషణ్ పక్వాడ్'



పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న ఎఎన్ఎం భీమమ్మ

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని పెద్దమట్టపల్లి సర్కిల్ పరిధి చిన్నమట్టపల్లి చెందిన అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషణ్ పక్వాడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ ఎఎన్ఎం కె.భీమమ్మ మాట్లాడుతూ పోషణ్ పక్వాడ్ పథకం ద్వారా వైఎస్ఆర్ కిట్లు, మల్టిగ్రేడ్ ఆట, రాగి పిండి, బెల్లం, ఖర్జూరం, చిక్కి, పాలు, గుడ్డు గర్భిణులు, బాలింతలకు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఎంఎల్‌హెచ్‌వి ఎం.సురేశ్ కుమార్, అంగన్ వాడీ టీచర్స్, కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ యస్.రంగమ్మ, పి.పుష్పవతి, సరోజిని, సునీత, పి.లక్ష్మి, రోజా, రామలక్ష్మి, అనూష, లక్ష్మి, ఎస్.బజారమ్మ, ఎస్.రాములమ్మ పాల్గొన్నారు.

ధారాలమ్మ ఆలయ హుండీ లెక్కింపు

ప్రజాశక్తి -సీలేరు : జికె.వీధి మండలంలోని ఘాట్‌రోడ్డులో ఉన్న ధారాలమ్మ అమ్మవారి ఆలయంలోని హుండీని సోమవారం లెక్కించారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ అధికారి సాంబశివరావు మాట్లాడుతూ భక్తులు కానుకల రూపంలో హుండీలో వేసిన వాటిని తమ శాఖ జూనియర్ అసిస్టెంట్ తేజ, హెచ్‌డిపిటి ఈశ్వరరావు, సిపిఐ నాయకులు సుంకర విష్ణుమూర్తి, గొర్ల గణేశ్వర్ ఆధ్వర్యంలో లెక్కించామని తెలిపారు. మూడు నెలలకు గాను రూ.2,87,300 ఆదాయం వచ్చిందని, ఈ మొత్తాన్ని అమ్మవారి బ్యాంక్ ఖాతాలో జనం చేస్తామని పేర్కొన్నారు.



ధారాలమ్మ ఆలయ హుండీ లెక్కిస్తున్న దేవాదాయశాఖ అధికారులు, సిబ్బంది

ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్న వైసిపి



నిరసనలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి

ప్రజాశక్తి-కొయ్యూరు : రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తుందని పాడేరు మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. మండలంలోని కినపర్తి, పి.మాకవరం పంచాయితీలలో సోమవారం ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గొలిసింగి సత్యన్నారాయణ, కొర్రు రామ్మూర్తి, సాంబశివరావు శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.